సీజనల్ వ్యాధులపై అవగాహన

నేరడిగొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. శుక్రవారం మండలంలోని గుత్పాల గ్రామంలో గల మినీ గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారీన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం సిజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్ఎం కల్పన, హాస్టల్ ఏఎన్ఎం శ్రీవాణి, హెచ్ఎం అనురాధ, ఆశా గంగామణి, తదితరులు పాల్గొన్నారు.



● ఇచ్చోడలో ముస్తాబవుతున్న ప్రతిమలు

చవితి వేడుకలకు గణపయ్యలు సిద్ధం

ఇచ్చోడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆగస్టు మాసంలో నిర్వహించనున్న చవితి వేడుకలకు వినాయకుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఇచ్చోడ మండల కేంద్రంలోని రైతువేదిక భవనం సమీపంలో వందల సంఖ్యలో వివిధ ఆకృతుల్లో విఘ్నేశ్వరుడి ప్రతిమలను నిపుణులు తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఇవన్నీ తెల్లని రంగులో మెరిసిపోతున్నాయి. ఒక ఫీటు నుంచి దాదాపు 15 ఫీట్ల ఎత్తు వరకు తయారుచేస్తున్నారు.

కలెక్టర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత కేంద్రంలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యా బోధన ప్రారంభించేలా కలెక్టర్ రాజర్షి షా చొరవ చూపడం పట్ల హ్యాండి క్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం భవిత కేంద్రం విద్యార్థులతో కలిసి కలెక్టర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. భవిత కేంద్రంలో ఏడో తరగతి వరకే అందుబాటులో ఉండడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన కలెక్టర్.. పదో తరగతివరకు విద్యా బోధన జరపాలని అధికారులకు సూచించడంతో కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి సైతం కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, అమీర్ ఖాన్, మొహమ్మద్, సయ్యద్ సాజిత్ పాల్గొన్నారు.



కలెక్టర్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న భవిత కేంద్రం విద్యార్థులు

జిల్లా విద్యా శాఖాధికారిగా ఖుష్బూగుప్తా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ.. విద్యా శాఖాధికారిగా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం డీఈవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా.. డీఈవో బాధ్యతలు అప్పగించడాన్ని విద్యార్థి సంఘాలు సైతం స్వాగతిస్తున్నాయి.

5న జాబ్ మేళా : జిల్లా అధికారి

తాంసి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించే జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన విభాగం అధికారి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, యువకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

'బీసీ బిల్లు ఆమోదం తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదం, చట్ట బద్ధత కోసం ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో 72 గంటల నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ మారన్న తెలిపారు. బీసీ బిల్లు విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయని ఆరోపించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వాలు మభ్యపెట్టే విధానాలకు స్వస్తి పలికి బిల్లు ఆమోదం దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలు తీసుకెళ్లేందుకు ఆరు నెలల గడువు: ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వివిధ నేరాల కింద స్వాధీనం చేసుకున్న వాహనాలను తిరిగి వాటి యజమానులు తీసుకెళ్లడానికి ఆరు నెలల అవకాశం కల్పిస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఒక ప్రకటనలో జిల్లాలోని 21 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన వాహనాలు ఉన్నాయని, మొత్తం 51 వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. ఏదైనా సందేహం ఉంటే రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళీ సెల్ నెం.8712659962 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

జైనథ్ ఐకేపీ ఏపీఎంగా కవిత

జైనథ్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంలో గల ఇందిరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఐకేపీ ఏపీఎంగా కవిత బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకేంద్రమైన ఆదిలాబాద్ డీఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కవిత జైనథ్ ఏపీఎంగా బదిలీపై వచ్చారు. జైనథ్ ఏపీఎంగా విధులు నిర్వహించిన ఎస్.భగవండ్లు తాంసి మండలానికి ఏపీఎంగా బదిలీ పై వెళ్లారు.

భీంపూర్‌లో బాలికకు డెంగీ నిర్ధారణ

భీంపూర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్మ గౌరీ బాయి అనే మూడు ఏళ్ల బాలికకు డెంగీ నిర్ధారణ అయ్యింది. అనారోగ్యంతో ఉన్న ఈ బాలికను తల్లిదండ్రులు ఆదిలాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రి తీసుక రాగా.. పరీక్షల తర్వాత డెంగీ నిర్ధారణ అయ్యింది. ఈ విషాయాన్ని వైద్యులు మలేరియా అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే జిల్లా మలేరియా నివారణ అధికారి మేటపెల్లి శ్రీధర్, డివిజన్ పంచాయతీ అధికారి ఫణిందర్‌లు శుక్రవారం భీంపూర్ వచ్చి పరిశీలన చేశారు. బాలిక ఇంటి పరిసరాలు సహా చుట్టూ పక్కల ద్రావణాలు పిచికారి చేయించారు.

'దార్లొద్ది జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి'

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని దార్లొద్ది జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగ్‌బాపురావు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి 20 కి.మీ.ల దూరంలో దార్లొద్ది గ్రామంలో అందమైన, ఎత్తైన జలపాతం ఉందన్నారు. అధికారులు స్పందించి జలపాతం అభివృద్ధి కోసంపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోశాధికారి టంకే నాగోరావు, నాయకులు లక్ష్మణ్, అజయ్ ఉన్నారు.

● ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని రేన్‌గేజ్ స్టేషన్



లెక్కతప్పుతున్న.. చినుకు లెక్కలు

- వర్షపు చినుకుల అంచనాల్లో కనిపించని శాస్త్రీయత
- మండల కేంద్రాలకే పరిమితమవుతున్న రెయిన్ గేజ్ స్టేషన్లు
- ఆటోమెటిక్, మ్యానువల్ లెక్కింపుల్లో భారీ తేడాలు
- కరువు ప్రాంతాల అంచనా, బీమా చెల్లింపులపై ప్రభావం
- అధికారుల నిర్లక్ష్యంతో అయోమయం

ఇంకా పురాతన పద్ధతుల్లోనే.. వర్షపు చినుకులను లెక్కగట్టడంతో వర్షపాతం నమోదు అంచనాలు లెక్కతప్పుతున్నాయి. వర్షపాతం ఆధారంగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు ప్రాంతాల అంచనా, వ్యవసాయ ప్రణాళికలు, పంటల భీమా చెల్లింపులను చేస్తాయి. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన వర్షపాతం నమోదుపై అధికారుల నిండు నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇప్పటికీ కొన్నిచోట్ల ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రాకపోవడంతో వర్షపాతం అంచనాలు తలకిందులవుతూనే ఉన్నాయి.

ఆదిలాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్స్ (ఏడబ్ల్యుఎస్), మరో 18 మ్యాన్‌వల్ రేన్‌గేజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి ఆధారంగానే కురిసిన వర్షాన్ని లెక్కగడుతు ప్రభుత్వానికి జిల్లా అధికారులు వర్షపాతం నివేదికలను పంపిస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం జిల్లాలో వరుసగా కరువు పరిస్థితులు సంభవించిన జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించ లేదు.అస్పష్టమైన వర్షపాతం నమోదు అంచనాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.వర్షపాతం ఆధారంగానే ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు పరిస్థితులను అంచనా వేస్తూ అవసరమైన పథకాలను రూపొందించాల్సి ఉంటుంది.

నమోదులో భారీ వ్యత్యాసం

ప్రస్తుతం అధికారులు మండల యూనిట్‌గా వర్షపాతం లెక్కలు కడుతున్నా రు. దీంతో వర్షపాతం నమోదులో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఒక ప్రాంతం లో కురిసిన వర్షం.. మరో ప్రాంతంలో కురవక పోవచ్చు. కొన్ని గ్రామాల మధ్యనే వర్షపాతంలో భారీ తేడాలు ఉంటున్నాయి. జిల్లాలో ఒక్కోమండలం సుమారుగా 20కి.మీ.ల నుంచి 30 కి.మీ.ల విస్తీర్ణం కలిగి ఉన్నాయి. అయితే కేవలం మండల కేంద్రంలోనే రేన్‌గేజ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ఆధారంగా వర్షపాతాన్ని లెక్కగడుతున్నారు. అలాంటప్పుడు మండల కేంద్రాలలో కురిసిన వర్షపాతం ఆధారంగా ఆ మండలంలో కురిసిన మొత్తం వర్షపాతాన్ని లెక్కగట్టడం సరైన పద్ధతి కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ప్రకారం ఒకరోజు 2.5 మి.మీ.లకు పైగా కురిసిన వర్షపాతాన్ని మాత్రమే ఒక వర్షపు రోజుగా గుర్తిస్తున్నారు. ఒక వర్షపు రోజు నుంచి మరో వర్షపు రోజుకు మధ్య 15రోజుల వ్యత్యాసం ఉంటేనే ఆ ప్రాంతంలో కరువు ప్రభావం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తారు. దీని ప్రకారమే ప్రభుత్వానికి నివేదికలు పంపించి కరువు ప్రాంతంగా ప్రకటిస్తారు. ఇంతగా ప్రాధాన్యత ఉన్న వర్షపాతం నమోదుపై నిర్లక్ష్యం చూపడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

> **కొంత తేడా కనిపిస్తుంది**
> **: బి.వెంకటరమణ, సీపీవో, ఆదిలాబాద్**
>
> ఆటోమెటిక్, మ్యానువల్ వెదర్ స్టేషన్ లెక్కల్లో కొంత తేడాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ఆధారంగానే వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తున్నాం. వర్షపాతాన్ని లెక్కించడంలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణను ఇచ్చాం. త్వరలోనే దాదాపుగా అన్ని చోట్ల ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే లెక్క

ప్రస్తుతం జిల్లాలో ఆటోమెటిక్, మ్యానువల్ స్టేషన్ల ఆధారంగా వర్షపాతాన్ని లెక్కగడుతున్నారు. అయితే ఆటోమెటిక్ మ్యాన్‌వల్ స్టేషన్ల లెక్కల్లోనే భారీ తేడాలు కనిపిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు స్టేషన్లు ఉన్న వాటి లెక్కల్లో మాత్రం తేడా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ కొన్ని మండలాల్లో వర్షపాతాన్ని నమోదు చేసే అధికారులు అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే కింది స్థాయి సిబ్బందితోనే వర్షపాతాన్ని లెక్క గడుతూ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అయితే వీరికి వర్షపాతం నమోదుపై ఎలాంటి అవగాహన, అర్హత లేక పోవడంతో తప్పులు దొర్లే అవకాశం ఉందంటున్నారు. క్షేత్రస్థాయి

(తరువాయి 6వ పేజీలో....)



ఇచ్చోడ మండల కేంద్రంలోని రెయిన్ గేజ్ స్టేషన్



● జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మ్యానువల్ రేన్‌గేజ్ స్టేషన్



● జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆటోమెటిక్ వెదర్‌స్టేషన్

పక్క ఫొటోల్లో కనిపిస్తున్న దృశ్యాలు.. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆటోమెటిక్, మ్యానువల్ వెదర్‌స్టేషన్లు. ఈ రెండు స్టేషన్లలోనే వర్షపాతం లెక్కల్లో భారీ తేడాలు వస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల కురిసిన వర్షాన్ని లెక్కించేందుకు అధికారులు ప్రయత్నించగా ఆటోమెటిక్ వెదర్‌స్టేషన్‌లో 45 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా, మ్యానువల్ స్టేషన్‌లో మాత్రం 30 మి.మీ.ల వర్షపాతం కురిసినట్లు అధికారుల లెక్కల్లో తేలింది. అంటే ఒకేచోట ఉన్న రెండు రేన్‌గేజ్ స్టేషన్లలో వర్షపాతం నమోదు లెక్కల్లో భారీ తేడాలు రావడం అయోమయానికి గురి చేస్తుంది. ఇలాంటి పరిస్థితులే జిల్లాలో పలు చోట్ల ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది.

నాణ్యమైన మొహువ లడ్డులు అందించాలి

● తయారీ యూనిట్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన మొహువ లడ్డులు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం మండలంలోని ఖైర్‌దాట్వా గ్రామంలో ఏర్పాటు చేసిన మొహువ లడ్డు తయారి యూనిట్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద రూ.6 లక్షల గ్రాంట్ ద్వారా మొహువ లడ్డు మిషన్, పుల్వరైజర్ మిషన్, తుకడా మిషన్, డఫ్ మిషన్ లాంటి మిషనరీలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గిరిజనులు తయారు చేస్తున్న మొహువ లడ్డులు ఎంతో రుచికరంగా ఉన్నాయని, ఆరోగ్య పరిరక్షణకు అనుగుణంగా, నాణ్యమైన ప్రమాణాలతో లడ్డులను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, జిల్లా అధికారులు రాథోడ్ రవీందర్, జితేందర్ రెడ్డి, గోవింద్ రావు, రాజలింగు, గంగాసింగ్, ఏపీఎం మైస రమేష్, మొహువ లడ్డు యూనిట్ సభ్యులు మాధవి పాల్గొన్నారు.

● రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ : ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, గడచిన పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆర్డీవో స్రవంతి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి వాజిద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో బాస్కర్, ఎంపీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లడ్డు తయారీ యూనిట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఇంద్రవెల్లిలో కలెక్టర్ రాజర్షిషాతో కలిసి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ముగిసిన ఆపరేషన్ ముస్కాన్

● జిల్లాలో 93 మంది బాల కార్మికుల గుర్తింపు, 28 కేసులు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి నెల రోజులుగా చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ ముగిసింది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ దుకాణాలు, హోటల్లు, భవన కార్మికులుగా పని చేస్తున్న 93 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు, వసతి గృహాలకు చేర్చినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. 70 మంది పిల్లలను తల్లిదండ్రులకు, 23 మంది పిల్లలను వసతి గృహాలకు తరలించి సొంత వారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

కాగా, జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగియడం పట్ల బృంద సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బాల కార్మికులను పని నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. ఈ మేరకు స్థానిక బాల రక్షక్ భవనంలో ఆపరేషన్ ముస్కాన్ ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అప్పుడే పత్తికి గులాబీ పురుగు!

తాంసి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇప్పుడిప్పుడే పెరుగుతున్న పత్తికి అప్పుడే గులాబీ పురుగు వ్యాపించింది. ఈ సంవత్సరం జూన్ 12 తేదీ నుంచి రైతులు విత్తనాలు నాటారు. ఇంకా విత్తనాలు నాటి 50 రోజులు కూడా కాలేదు. అప్పుడే గులాబి రంగు ప్రవేశించడంతో రైతుల్లో గుబులు మొదలైంది. వాస్తవానికి ప్రతి సంవత్సరం ఈ గులాబీ రంగు పురుగు పత్తి చివరి దశలో ప్రవేశం చేది. కానీ ఈ సంవత్సరం మొదటి దశలోనే వ్యాపిస్తుండటంతో రానున్న రోజుల్లో పంటకు ఇంక ఎలాంటి తెగులు వ్యాపిస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు గులాబీ రంగు నివారణకు చేపట్టే ఉపాయాలను తెలపాలని రైతులు కోరుతున్నారు.



పత్తిపూతలో ప్రవేశించిన గులాబీ పురుగు



ఐటీడీఏ పీవోతో మాట్లాడుతున్న ఆదిమ గిరిజన సంఘాల నాయకులు

హయత్‌నగర్ ఎక్సలెన్సి కళాశాలను తరలించొద్దు

● ఐటీడీఏ పీవోను కోరిన ఆదివాసీలు

ఉట్నూర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొలాం, మన్నె, చెంచులకు చెందిన గిరిజన విద్యార్థులు హయత్‌నగర్ ఎక్సలెన్సి గురుకులంలో చదువుతు న్నందున ఆ కళాశాలను ఇతర చోటికి తరలించకుండాచర్యలు చేపట్టాలని ఆదిమ గిరిజన కోలాం సేవా సంఘం నాయకులు శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి కోరారు. ఇంటర్ చదువుతున్న వారు 200 మంది ఆదిమ గిరిజన విద్యార్థులు హైదరాబాద్ హయత్‌నగర్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలో చదువుతున్నారన్నారు. ఈ కళాశాలలో గిరిజన విద్యార్థులు అనేక రంగాల్లో విజయం సాధించారన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించి ఐదు సంవత్సరాల నుంచి పీవీటీజీ విద్యార్థులు కైవసం చేసుకుంటున్నారన్నారు. ఇందులో కొడప సోనేరావు, మడావి గోవిందరావు, టేకం లక్ష్మణ్, సిడాం అన్నిగా, మడావినాగరావ్, మడావి కిషన్, టేకం భీమావులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఉన్న దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన దివ్యాంగులు ఐటీడీఏ పీఓకు మొర పెట్టుకున్నారు. శుక్రవారం ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా తన చాంబర్‌లో దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం అమలు చేయాలని గిరిజనులు విన్నవించారు. పీవో మాట్లాడుతూ పీవీటీజీ దివ్యాంగులు ఉన్నట్లయితే వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి కోసం ఏదైనా స్కీము మంజూరు చేయించవచ్చని అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.నగేష్, గేడంజమున, జగతిరావు, బుచ్చన్న, సరోజ, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి

వివరాలు 6వ పేజీలో....

ఘనంగా కనక లక్కేరావు వర్ధంతి

ఇంద్రవెల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్ దివంగత కనక లక్కేరావు ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని తుమ్మగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై కనక లక్కేరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనవరాలు, మనువళ్ళు చదువుల కోసం రూ. 50 వేల ఆర్థిక సాయం అందించారు. ఇందులో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రే, ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్ పటేల్‌లు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపద విద్యార్థులే : బోథ్ ఎమ్మెల్యే

బోథ్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు దేశ సంపద భావి భారత పౌరులేనని విద్యార్థులంతా ఉన్నతులుగా ఎదిగితే భవిష్యత్తు పునాదులు అవుతారని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 93 మంది విద్యార్థులకు పాదరక్షలు, షూస్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విషయ పరిజ్ఞానం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని వారు బోధించేది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ విహార్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుద్ధ విహార్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. స్థానిక కైలాష్ నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు బౌద్ధ వందనం సమర్పించారు. పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా బుద్ధ విహార్‌లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

'అనుమతులు వచ్చిన తర్వాతనే పనులు'

బోథ్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కైలాస్టేకి శివ ఆలయం వరకు 12 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే పనులు చేపట్టే కాంట్రాక్టర్ జెసిబీని ముందుగా తరలించడం జరిగింది. అయితే అక్కడే అడవిలో ఉన్న బీట్ ఆఫీసర్ అనిల్ జెసిబీ నిలిపివేసి లోపలికి వెళ్ళవద్దని అనుమతులు వచ్చిన తర్వాతనే పనులు ప్రారంభించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే జెసిబీని సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని ఆయన వివరించారు. దీంతో జెసిబిని అక్కడే నిలిపివేయడం జరిగింది.

బాలికలకు టై, బెల్టుల పంపిణీ

ఉట్నూర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాలికలు)లో విద్యార్థులకు టై మరియు బెల్టులను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఉదారంగా అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను కాపాడుకోవడంతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో తయారు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం భావిస్తుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉట్నూర్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర పాధ్యక్షులు శీతల్‌చౌహాన్‌లా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ మాట్లాడారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు శీతల్ చౌహాన్, జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్‌అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, శీతల్‌చౌహాన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దిలేష్‌చౌమాన్, తదితరులున్నారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి వేడుకలు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులను అభినందిస్తున్న జోగురామన్న


అన్నాబాహుసాటే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే


ఇచ్చోడలో అన్నాభావుసాఠే జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అన్నాబాహు సాటే జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అన్న బాహుసాటే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాంగ్ సమాజ్ ప్రతినిధులు, ఆయా సంఘాల సభ్యులతో కలిసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సచిన్ సాగోరే, జగన్ గొండ్రికే, రమాకాంత్, గోటుముక్కలే అజయ్, ఆకాశ దీపక్ మోరే పాల్గొన్నారు. అలాగే అన్నబావు సాటే జయంతిని పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్ నగర్‌లో మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, యాసం నర్సింగరావు, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో అన్న బాహుసాటే విగ్రహానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లింగన్న, దేవదాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కవి, సామ్రాట్, లోక్ శామిర్, సాహిత్యవేత్త, సంఘట సంస్కర్త అన్నా బాము సాటే జయంతిని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయన వెంట నిర్వహణ కమిటీ సభ్యులు దిగంబర్, సంజీవ్, అరికెల అశోక్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బానోత్‌జైవంత్‌రావు, హస్నాపూర్‌లో అన్నాబాహు సాటే విగ్రహానికి మాజీ సర్పంచ్ జాదవ్ ఉపేందర్, మాజీ ఉప సర్పంచ్ అశోక్, నిర్వహణకమిటీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోప్లేన్యాను, ప్రకాష్, వాఘ్మారే కిరణ్, పృథ్విరాజ్, రాంప్రసాద్, దీపక్, విఠల్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలకేంద్రంతోపాటు మండలంలోని ముక్రా(కె) గ్రామంలో అన్నా బాహుసాటే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జన్నారపు సాహెబ్‌రావ్, సభ్యులు గణేష్, మధుకర్, చిట్టిరవి, భూమన్న, డీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్ర గ్రామంలో అన్నాబాహు సాటే యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నాబాహు సాటే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సొంటకే గజానంద్, మాంగ్ సమాజం జిల్లా అధ్యక్షుడు పరశురాంలు బ్రహ్మనంద్, సూర్యకాంత్, ప్రభాష్, బాలాజీ, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రపంచంలోనే గొప్ప సాహితీవేత్త, సాహిత్య సామ్రాట్ అన్నాబాహు సాటే అని అన్నబావు సాటే సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆందారే బాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా అన్నాబావు సాఠే జెండాను ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాంబ్లే సునీల్, మోతేవార్ సంభాజీ పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు శ్రేష్టం: సీడీపీవో

ఉట్నూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమైనవని ఉట్నూర్ ఐసీడీఎస్ సీడీపీఓ మాస ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని బీర్సాయిపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రసవించిన సమయంలో ముందుగా వచ్చే ముర్రుపాలు పిల్లలకు పట్టించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రాజు గోండు సేవాసమితి కార్యవర్గం ఎన్నిక

బోథ్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సోనాల మండలం రాజు గోల్డ్ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భూమన్న, అధ్యక్షుడిగా సోయం బాబురావు, ఉపాధ్యక్షుడిగా జుగుణకు కైలాస్, కొమురం మాణిక్ రావు, ప్రధాన కార్యదర్శిగా రాయిసీడం రాకేష్, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎఫ్ఆర్ఎస్‌తో పింఛన్ల చెల్లింపు

ఉట్నూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం పింఛన్ల చెల్లింపులలో అక్రమాలను అడ్డుకోవడానికి సరికొత్త విధానం ప్రవేశ పెట్టింది. దివ్యాంగుల పింఛన్లు, వితంతు పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లు ప్రతినెల ప్రభుత్వం అభాగ్యులకు ఆసరా కల్పించడానికి పింఛన్ల రూపంలో అందిస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లను ఇక నుంచి ఫేస్‌రీడింగ్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా అందించాలని ఆదేశించడంతో ఉట్నూర్‌లోని దంతన్‌పల్లి జీపీ కార్యాలయంలో కార్యదర్శి అరవింద్ సమక్షంలో బీపీఎం సామసాయికృష్ణారెడ్డి శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు.

నవోదయ పాఠశాల మంజూరు చేయాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు జవహర్ నవోదయ పాఠశాలను మంజూరు చేయాల్సిందిగా ఎంపీ గోడం నగేష్ పార్లమెంట్ సమావేశాల దృష్టికి తీసుకెళ్లారు. 377 నిబంధన ప్రకారం జిల్లాకు పాఠశాల కేటాయిస్తే స్థానిక విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులకు జాతీయస్థాయి విద్యాప్రమాణాలు అందాల్సిన అవసరం ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షాకాలం వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోథ్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్డీ బి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. వ్యాధులు ప్రబలిన వెంటనే హాస్టల్‌లో ఉండే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

పీహెచ్‌సీ కేంద్రాల వద్ద ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖలో ఉద్యోగులకు ఆధార్ బేస్డ్ అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాలోని యూ.పీ.హెచ్.సి, పీ.హెచ్.సి కేంద్రాల వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులతో సంప్రదింపులు జరపకుండానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పుష్పలత, ఆనంద బాయ్, ప్రశాంత్ దేశ్‌పాండే, రనిత, తులసి, జ్యోతి, తదితరులున్నారు.

లెక్కతప్పిన.. చినుకు లెక్కలు

(5వ పేజీ తరువాయి...)

సిబ్బంది చెప్పిన లెక్కల ప్రకారమే ఉన్నతాధికారులు నివేదికలను రూపొందిస్తూ ప్రభుత్వానికి పంపుతున్నారు.

పరిహారం చెల్లింపుల్లో ఇబ్బందులు

వర్షపాతం నమోదు లెక్కల్లో స్పష్టత లేక నష్టపరిహారం చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పంటల బీమా పథకాలతో రైతులకు పంటనష్ట పోయిన సమయంలో పరిహారాన్ని అందించే అవకాశం ఉంటుంది. అయితే బీమా కంపెనీలు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ల సమాచారం ఆధారంగానే బీమా చెల్లింపులను చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు కొన్ని మండలాల్లోనే ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు పని చేస్తున్నాయి. ఇవి గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలివేగం వీచే దిశలను గుర్తించి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందిస్తాయి. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల సమాచారానికి రెవెన్యూ అధికారులు సేకరించే సమాచారానికి ఎలాంటి పొంతన లేకుండానే పోతుంది. దీంతో బీమా చెల్లింపులు కరువు అంచనాలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. తద్వారా అతివృష్టి, అనావృష్టి సహాయం అందక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యానన్న మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన రిత్విక్ (17) పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. గత నెలలో మొదటి సంవత్సరం ఫలితాలు విడుదల కాగా.. అందులో సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదే క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రౌడీయిజం చేస్తూ, బెదిరింపులకు పాల్పడడమే కాకుండా.. మారణాయుధాలతో ప్రజలు ఉండే స్థలాలలో విన్యాసాలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న షేక్ సలీం అలియాస్ కైంచి సలీం పై పీడీ యాక్ట్ నమోదు చేసి చంచల్ గూడ జైలుకు తరలించడం జరిగిందని డీ.ఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఇదివరకే ఎనిమిది కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు, రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆరు కేసులతో పాటు ఆటో డ్రైవర్ ను కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై, రౌడీయిజం చేసే వారిపై, గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రవర్తన మార్చుకోని రౌడీలు, వ్యవస్థీకృత నేరాలు చేసే వ్యక్తులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన వారిలో ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సై విష్ణు వర్ధన్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జైనథ్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జైనథ్, బేల మండలంలోని ఆయా గ్రామాలలో గల బ్యాంకు వినియోగదారులు సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని ఆర్బీఐ ఎల్‌డీఎం రాములు అన్నారు. శుక్రవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని పార్డీ(బి) గ్రామంలో వినియోగదారులకు నిర్వహించిన జన్ సురక్ష క్యాంపునకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సైబర్ హెల్ప్‌లైన్ 1930 నెంబర్‌పై వివరించారు. సోషల్ స్కీమ్స్, పీఎం ఎస్‌బీఐవై మరియు అటల్ పెన్షన్ యోజన గురించి చెప్పడం జరిగింది. కేవైసీ యొక్క ముఖ్య ఉద్దేశాలు అంక్లైమ్ డిపాజిట్స్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్బీఐ ఎల్‌డీఎం ఉప్పల్, పంజాబ్‌నేషనల్ బ్యాంకు మేనేజర్ ఆశీష్, బీజేపీనాయకులు పోతరాజు, రమేష్‌లతో పాటు పార్డి(బి) గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఆసుపత్రి ఆవరణలో శ్రమదానం చేస్తున్న సిబ్బంది

ఆరోగ్య సిబ్బంది శ్రమదానం

కుబీర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆరోగ్య సిబ్బంది శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. నిలిచిన వర్షపు నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. విజేష్‌రాథోడ్ మాట్లాడుతూ సంబంధిత పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని శుక్రవారం డ్రైడే సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రమదానం చేపట్టామన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు

కడెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బాణావత్ ఆనంద్ బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు జైలుకి పంపినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. బాణావత్ ఆనంద్ గతంలో నాటుసారాయి విక్రయిస్తూ పట్టుబడగా అతడిపై కేసు నమోదు చేసి, కడెం మండల తహసీల్దార్ ముందు రూ.లక్ష జరిమానా లేదా ఒక సంవత్సరానికి జైలు శిక్షకి బైండోవర్ చేశారు. బాణావత్ ఆనంద్ బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నాటుసారాయి తయారీ ముడిసరుకులు నల్ల బెల్లం, పట్టికని ఆటోలో రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి బైండోవర్ ఉల్లంఘన చేసినందుకు కడెం తహసీల్దార్ ప్రభాకర్ ముందు హాజరుపరచగా ఆనంద్‌ను రిమాండ్‌కు పంపాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జైలుకి పంపినట్లు ఎక్సైజ్ సీఐ అభిషేకర్ తెలిపారు. నాటుసారాయి తయారుచేసిన, అమ్మిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని తెలిపారు. సిబ్బంది వెంకటేష్, సాయి, రాజేందర్, రవీందర్ పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం చోరీ

భైంసారూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామానికి చెందిన కరేవాడ్ మైసాజీ ఇంట్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. కూతుళ్లతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకున్న తర్వాత మరునటి రోజు ఉదయం సమయం లేని చూసేసరికి తలుపులు తీయటానికి ప్రయత్నం చేయగా బయట నుంచి గొళ్లెం పెట్టి ఉన్నట్లు బాధితులు తెలిపారు. తన ఇంటి పక్కనున్న శోభ అనే ఆమెకు ఫోన్ చేసి తలుపు తీయాలని చెప్పగా ఆమె వచ్చి తలుపు గొళ్లెం తీసిందని, బయటికి వచ్చి చూడగా వారి పక్కరూమ్ గొళ్లెం పగులగొట్టి తలుపు తీసి రూమ్‌లో ఉన్న రెండు తులాల రెండు మాసాల బంగారం పుస్తెలతాడు, మూడు జతల వెండి పట్టీలు 24తులాలు, రూ.5,000లను దొంగలు ఎత్తుకెళ్లారని మైసాజీ ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖానాపూర్ ఎంపీడీవోగా

రమాకాంత్ బాధ్యతల స్వీకరణ

ఖానాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఎంపీడీవోగా రమాకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖానాపూర్ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సునీతను పెంబికి, పెంబి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రమాకాంత్‌ను ఖానాపూర్‌కు డిప్యూటేషన్‌పై పంపుతూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రమాకాంత్ ఖానాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించి విధులకు హాజరయ్యారు.


సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న సీఐ


కాలనీ వాసులతో మాట్లాడుతున్న పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే కార్డెన్ అండ్ సెర్చ్: సీఐ అజయ్ కుమార్
- పలు వాహనాల సీజ్

ఖానాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఖానాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. 45 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారు వాహన ధ్రువపత్రాలు సరిగ్గా లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడిన సీఐ పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. నేరాల నియంత్రణకు ఉపయోగపడే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. రోడ్డు నిబంధనలను ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. వాహన యజమానులు మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్‌లో ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ సహా సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్సైలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్ర రజతోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ 25 వసంతాల కార్యక్రమాల పోస్టర్లు, కరపత్రాలు జిల్లా కేంద్రంలో జిల్లా సైన్స్ అధికారి కే.వినోద్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. రాజతోత్సవ వేడుకలను ప్రారంభించినట్లు రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రయాణం రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యా, వైద్యం, ఆరోగ్యం, యువత, పర్యావరణం, ఆత్మహత్యల నివారణ, స్వయం ప్రతిపత్తి, స్వాలంబన తదితర అనేక అంశాలపై 25 సంవత్సరాలుగా నిరంతర కార్యక్రమాలు చేపడుతుండటం హర్షనీయమన్నారు. నాలుగు సాధారణ బోగీలను సాధించిన ఉద్యమానికి ఆరోగ్యమిత్ర నేతృత్వం వహించిందని, ఆత్మహత్యలపై గత 20ఏళ్లుగా తెలుగు రాష్ట్రాలలో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ యూత్ కన్వీనర్ పరికిపండ్ల, సహజ, సామాజికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్‌లు చెల్లించాలి

కుంటాల, ఆగస్టు1: (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను చెల్లించాలని ఏఎస్ఐ దేవన్న అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్ గ్రామ సమీపంలో భైంసా- నిర్మల్ రహదారిపై ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలపై నంబర్ ఆధారంగా పెండింగ్ చలాన్‌లను పరిశీలించారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

బొమ్మరిల్లు కాలనీలో వనమహోత్సవం

నిర్మల్‌రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమ్మరిల్లు కాలనీలో వనమహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానికులు పలు రకాల మొక్కలను నాటినట్లు కాలనీ అధ్యక్షుడు పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థి రిదాన్ సాయి, భూషణ్, రవీందర్ రెడ్డి, సంపత్ కుమార్‌లు తదితరులు చురుకుగా పాల్గొని సుమారు 150 మొక్కలు నాటినట్లు తెలిపారు.

వసతి గృహాల్లోని విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలి

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా వసతి గృహాల్లోని విద్యార్థులందరినీ తమ స్వంత పిల్లలుగా చూసుకోవాలని బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని బీసీ వసతి గృహాల వార్డెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానకాలం సీజన్ నేపథ్యంలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వెల్లడించారు. మెనూ ప్రకారం రుచి,శుచితో కూడిన భోజనం అందించాలని తెలిపారు. శుభ్రత,పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ వసతిగృహాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించి ఆయా వసతి గృహాల సమస్యలు, తాజా స్థితి, గతులు, విద్యార్థుల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింప చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ వసతి గృహ వార్డెన్లు

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీకి ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు


విద్యార్థులకు మొక్కను అందజేసి అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఖానాపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీకు ఎంపికైన ఖానాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్ సంతోష్ అభినందించారు. ఎంపికైన డి.శ్రీనయ్, బి.పవన్ కుమార్, ఎం.విష్ణువర్థన్, టి.శేఖర్‌లను శుక్రవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సహా ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో సీట్లు సాధించారని పేర్కొన్నారు.

'మహాగర్జనను విజయవంతం చేయాలి'

నర్సాపూర్(జి), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పింఛన్లను రూ. 6,000లకు పెంచాలన్న డిమాండ్‌తో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'దివ్యాంగుల మహాగర్జన'ను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు బర్కుంట సాగర్ కోరారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని కుస్లీ గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ఈ మేరకు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమైందని ఆయన వివరించారు. దివ్యాంగులందరూ ఈ మహాగర్జనలో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కులను సాధించుకోవాలని సాగర్ కోరారు. కార్యక్రమంలో కుస్లీ గ్రామ ఎంఆర్‌పీఎస్ నాయకులు కూడా పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు

నిర్మల్‌రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని రూరల్ ఎస్సై లింబాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని తాంశ గ్రామంలో ఊరి పెద్ద మనుషులతో ప్రజలకు దొంగతనాలు, నేరాల నియంత్రణ, సీసీ కెమెరాలు ఏర్పాటుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయానికి సీసీ కెమెరా విరాళం

ఖానాపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శ్రీ నల్లపోచమ్మ ఆలయానికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్ సీసీ కెమెరాను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ఆవరణలో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. అడవి ప్రాంతంలో ఉన్న దేవాలయమైనందున సీసీ కెమెరా ఏర్పాటు చేయించినట్లు సంతోష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈశ్వర చారి, తదితరులున్నారు.

లక్ష్మణచాంద ఏపీఎంగా నారాయణరెడ్డి

లక్ష్మణచాంద, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల ఐకేపీ ఏపీఎంగా లోక నారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వృత్తిపరమైన బదిలీలలో భాగంగా తానూర్ మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై లక్ష్మణచాందకు వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన వాణిశ్రీ సోన్ మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన నారాయణ రెడ్డిని సహచర సిబ్బంది శాలువాతో సన్మానించారు.


నారాయణ రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న సిబ్బంది

హలో.. హలో

- సిగ్నల్ రాదు.. నెట్వర్క్ ఉండదు
- ప్రభుత్వ పథకాల ఆన్‌లైన్‌కు ఇబ్బందులు

ముథోల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామానికి సెల్ సిగ్నల్స్ అందక జనం అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎయిర్టెల్, జీవో, బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ గల వినియోగదారులు సుమారు 800ల వరకు ఉంటారు. సెల్ సిగ్నల్స్ కోసం కట్టలు, గుట్టలు, ఊరు చివర వరకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్ చేసుకోవడం ఇబ్బందిగా మారింది. ప్రజలు సెల్ సిగ్నల్స్ అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఇంటర్నెట్ సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. గ్రామస్థులు ప్రభుత్వ పథకాలకు సంబంధించి వేలి ముద్రలు, బీమా నమోదు వంటి ఆన్‌లైన్ పనులకు అవస్థలు తప్పడం లేదంటున్నారు. ప్రతీ నెల పింఛన్ డబ్బులు తీసుకునేందుకు కూడా సిగ్నల్ టవర్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ గ్రామం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత సెల్ ఫోన్ల నెట్వర్క్‌ల సిబ్బందికి విన్నవించిన ఎవరు పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. టవర్ ఏర్పాటు చేస్తే సమస్య ఉండదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో

బోథ్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను శుక్రవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం జరుగుతున్న కొద్ది దశలవారీగా నిధులు జమ చేయడం జరుగుతుందని సూచించారు. ఆయన వెంట ఎంపీఈవో అతుల్ కుమార్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

జూలైలోనూ లోటు వర్షపాతం

- రెండు నెలల సాధారణ వర్షపాతం 469.7 మి.మీటర్లు
- నమోదైన వర్షాపాతం 373.4 మి.మీటర్లు
- నిర్మల్ అర్బన్ మినహా అంతటా తక్కువ వర్షాలు
- నిండని సాగు నీటి వనరులు
- వాగులు,వంకల్లో అంతంత మాత్రంగానే నీటి ప్రవాహం


తరోడా గ్రామంలో నామమాత్రంగా నిండిన చెరువు


కుభీర్‌వద్ద నీటి ప్రవాహం లేని వాగు

భైంసా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ నెల తరహాలోనే జూలై మాసంలో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. జూన్ మాసంలో జిల్లా సాధారణ వర్షపాతం 173.3 మిల్లీ మీటర్లు ఉండగా, మా సాంతం నాటికి 32 మీ.మీటర్ల లోటు వర్షపాతంతో 141.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే క్రమంలో జూన్, జూలై రెండు నెలలకు సంబంధించి జిల్లా సాధారణ వర్షపాతం 469.7 మి.మీటర్లు ఉండగా 20.6 శాతం లోటు వర్షపాతంతో 373.4 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది.

● గతేడాది అధిక వర్షపాతం నమోదు..

జిల్లాలో గత సంవత్సరం జూన్, జూలై మాసాలలో సాధారణ స్థాయిని దాటి వర్షపాతం నమోదు అయ్యింది. రెండు నెలల సాధారణ వర్షపాతం 469.7 మి.మీటర్లు ఉం డగా గతేడాది 93.6 మి.మీటర్ల వర్షం అధికంగా కు రిసి 563.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.ఈ యేడాది 20.6 మి.మీటర్ల లోటు వర్షపాతం నమోదు అవ్వగా గతేడాది 32.7 శాతం అధిక వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం జిల్లాలోని 19 మండలాల్లో ఒక భైంసా మండలం మినహా మిగతా అన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు అయ్యింది. గత సంవత్సరం భైంసా మండలం సాధారణ వర్షపాతం 467.7 మి.మీటర్లు ఉండగా 423.9 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది

18 మండలాల్లో లోటు వర్షాలు

జిల్లాలో 19 మండలాలు ఉండగా నిర్మల్ అర్బన్ మినహా మిగతా అన్ని మండలాల్లో తక్కువగా వర్షాలు కురిసాయి. నిర్మల్ అర్బన్ సాధారణ వర్షపాతం 500.7 మి.మీటర్లు ఉండగా 511.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఇక మిగతా మండలాలను పరిశీలిస్తే కుభీర్ మండలంలో 466.7 మి.మీటర్లకు 345.6 మి.మీటర్లు, తానూర్ మండలంలో 444.5 మి.మీటర్లకు 300 మి.మీటర్లు, బాసర మండలంలో 458.6 మి.మీటర్లకు గాను 289.2 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 465 మి.మీటర్లకు గాను 358.6 మి.మీటర్లు, భైంసా మండలంలో 467.7 మి.మీటర్లకు గాను 379.7 మి.మీటర్లు, కుంటాల మండలంలో 470 మి.మీటర్లకు 424.7 మి.మీటర్లు, లోకేశ్వరం మండలంలో 428.6 మి.మీటర్లకు గాను 398.6 మి.మీటర్లు, దిలావర్‌పూర్ మండలంలో 498.2 మి.మీటర్లకు గాను 341.8 మి,మీటర్లు, సారంగపూర్ ండలంలో 482.7 మి.మీటర్లకు గాను 461 మి,మీటర్లు, నిర్మల్ రూరల్ మండలంలో 473.2 మి. మీటర్లకు 421.7 మి.మీటర్లు, సోన్ మండలంలో 466.4 మి,మీటర్లకు గాను 296 మి,మీటర్లు, లక్ష్మణచాంద మండలంలో 456.7 మి.మీటర్లకు గాను 343.6 మి. మీటర్లు, మామడ మండలంలో 439.1 మి,మీటర్లకు గాను397 మి,మీటర్లు, పెంబి మండలంలో 486 మి,మీటర్లకు 376.6 మి.మీటర్లు, ఖానాపూర్ మండలంలో 476.3 మి,మీటర్లకు గాను 344.3 మి,మీటర్లు, కడెం మండలంలో 499.7 మి,మీటర్లకు గాను 338.4 మి,మీటర్లు, దస్తూరాబాద్ మండలంలో 476.9 మి,మీటర్లకు 348.3 మి,మీటర్లు,నర్సాపూర్(జి) మండలంలో 467.1 మి.మీటర్లకు 418.8 మి.మీటర్ల వర్ష పాతం నమోదైంది.

● అంతంత మాత్రంగానే నిండిన సాగు వనరులు

జిల్లాలో లోటు వర్షపాతం మూలంగా సాగు నీటి వనరుల్లో అంతంత మాత్రంగానే నిండుకున్నాయి. చెరువులు, కుంటల్లో నామమాత్రంగా వరద నీరు వచ్చి చేరింది. భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 0736 టీఎంసీ వరద నీరు వచ్చి చేరి ప్రాజెక్టు నీటి మట్టం 357.3 మీటర్లకు మాత్రమే చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.091 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇక నామమాత్రపు వర్షాలతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది.

● ఆందోళనలో రైతులు

సాగు వనరుల్లో అంతంత మాత్రంగానే నీటి నిల్వలు చేరుకోవడంతో సాగునీటి వనరుల కింద పంటలు సాగు చేసే రైతాంగం ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో వరి సాగు చేయాల వద్ద అన్న మీమాసంతో రైతులు కలవరపడుతున్నారు.నారు మడులను సిద్ధం చేసుకున్న రైతులు వాటిని నాటాలా వద్ద అనే సందేహంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు.

మాజీ మంత్రి చొరవతోనే రోడ్లు

- పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

దిలావర్‌పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చొరవతోనే సిర్గాపూర్ ఎక్స్ రోడ్ నుంచి కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వరకు, దిలావర్‌పూర్ తండా నుంచి బన్సపల్లి, చిట్యాల వరకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని పీఏసీఎస్ చైర్మన్ వీవీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023లోనే రోడ్లు మంజూరయ్యాయని, పనులు కూడా ప్రారంభించిన గుత్తేదారు అర్థాంతరంగా పనులు నిలిపివేశాడని చెప్పారు. వాస్తవం ఇట్లుండగా జూలై 30న ఆ పనులకే తిరిగి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపనలు చేయడం శోచనీయమన్నారు. ఆయా రోడ్లకు నిధులు ఎమ్మెల్యేనే మంజూరు చేయించినట్లు చెప్పడం దారుణమన్నారు. అబద్దాలతో ప్రజలను ఏమార్చలేరని అన్నారు. ప్రజలు సైతం ఎవరు ఏం చేశారో చేస్తున్నారో గుర్తించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ పి.శ్రీనివాస్, కదిలి మాజీ చైర్మన్ సంభాజీ పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.పి. శ్రీనివాస్ రెడ్డి, కాల్వ టెంపుల్ మాజీ చైర్మన్ ఉజారం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో


ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేస్తున్న డీఐఈవో

ఇంద్రవెల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో బోధన, వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల ప్రభుత్వం కళాశాలలో మరమ్మతు పనుల కోసం, మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రభుత్వ నిధులు మంజూరు చేసిందన్నారు. సంబంధిత వీవో గ్రూపు ద్వారా కళాశాలలో వెంటనే మరమ్మతుల పనులు ప్రారంభించాలన్నారు. కళాశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల సౌకర్యం కోసం రూ.17 లక్షలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మారుతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి పగుళ్లు



హర్కాపూర్‌లోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల


హర్కాపూర్ పాఠశాల పైకప్పుకు పగుళ్లు తేలి ఊరుస్తున్న దృశ్యం

- ఆదుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రం

ఉట్నూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల భవనంపై కప్పుకు పగుళ్లు తేలి వర్షపు నీటితో ఊరుస్తుండడంతో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఆదుకుంటుంది. ఉట్నూర్ మండలంలోని హర్కాపూర్ గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో పది మంది చిన్నారులు ప్రాథమిక విద్య అభ్యసిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పైకప్పు స్లాబ్‌కు పగుళ్లు తేలి ఊరుస్తుండడంతో విద్యార్థులకు ఎలాంటి అపాయం జరుగకుండా ఉండడానికి ఎస్సీఈఆర్టీ బలిరాం ఆదేశాల మేరకు అక్కడి పాఠశాల టీచర్ అంగన్‌వాడీ కేంద్రంలో గిరిజన చిన్నారులకు చదువు చెబుతుంది. ఇప్పటికైనా అవసరమైన చోట పాఠశాలల భవనాలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

శునకాల స్వైర విహారం

- వాహన చోదకులు, పాదచారులపై దాడి


ఆస్పత్రి సమీపంలో గుంపులుగా రోడ్డుపై ఇలా..


రాత్రి సమయంలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

ఇచ్చోడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రమవడంతో పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు ఆ మార్గాల్లో వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. వీటి భారి నుంచి కాపాడాలని పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రహదారిలో నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తుండడంతో ఆసుపత్రికి వెళ్లడానికి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీ, ఆశోక్‌నగర్, విద్యానగర్, సుభాష్‌నగర్, ఇస్లాంపూర, రజాన్‌పూర, మార్కెట్‌గల్లీ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

గుంపులుగా సంచరిస్తూ..

ఇచ్చోడ పట్టణంలోని సిరిచెల్మ కూడలి ప్రాంతంలో కొన్ని రోజుల కిందట రాత్రి వేళ ఓ వాహన చోదకుడు వెళ్తుండగా గుంపుగా రోడ్డుపై ఉన్న శునకాలు అతనిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన అతను వేగంగా వాహనాన్ని నడపడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వారిని భయందోళనకు గురిచేస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదు మేరకు వీధి కుక్కలను పట్టుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పరిస్థితిలో సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జాగ్రత్త చర్యలతో అగ్ని ప్రమాదాలు దూరం

- భైంసా ఫైర్ ఆఫీసర్ రవి


ప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రవి

భైంసా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతో వ్యవహరిస్తూ కొద్దిపాటి జాగ్రత్త చర్యలు పాటిస్తే అగ్నిప్రమాదాలు దూరంగా ఉంటాయని భైంసా ఫైర్ ఆఫీసర్ రవి తెలియ చెప్పారు. శుక్రవారం భైంసాలోని పులేనగర్ సుభద్రవాటిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాద నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను తెలియచెప్పారు. గ్యాస్ సిలెండర్, విద్యుత్‌తో ఏర్పడే ప్రమాదాలను తెలిపారు. ప్రమాదం జరిగినపుడు అవలంబించాల్సిన పద్దతులను వివరించారు.ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. గుడిసెలు, పెంకుటిల్లు ప్రమాదాల బారిన పడ్డప్పుడు పాటించాల్సిన రక్షణ చర్యలు తెలిపారు. వంటగ్యాస్ వినియోగించినపుడు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరిం చారు. ప్రమాదవశాత్తు నీట మునిగిన బాధితులను రక్షించే విధానాలు, భూకంపలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు జరిగినపుడు వినియోగించే పరికరాలను వివరించి వాటి పనితీరును ప్రదర్శించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్, అచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


కూలిన ఇల్లు




ఫ్లెక్సీలతో గుడిసె వేసుకున్న లక్ష్మి

ఇల్లు లేక నరకం.. లేదా కనికరం!

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఓ వైపు ఇళ్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతుంటే.. మరోవైపు కొందరు లబ్దిదారులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణంలోని రణదీవే నగర్‌కు చెందిన సురేశ్వర్ లక్ష్మీకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆన్ లైన్‌లో ఐడీ రాకపోవడంతో ఇంటి పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పాత ఇల్లు కూలిపోవడంతో పక్కనే గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు ఆడపిల్లలున్న తనకు నిలువ నీడ కరువయిందని, అధికారులు స్పందించి ఐడీ వచ్చేలా చూస్తే ఇంటి పనులు మొదలవుతాయని వాపోతున్నారు.

● (ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

కొండెక్కిన కొబ్బరి కాయ

- నెల రోజుల్లోనే రూ. 15 నుంచి రూ.30 పెరిగిన ధర
- కిలో కుడుకలు రూ. 300
- కొబ్బరి బొండం రూ. 60
- కొబ్బరి నూనె 500 గ్రాములు రూ. 235


కొబ్బరికాయలు

ముథోల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మునుపెన్నడూ లేని విధంగా కొబ్బరికాయ ధరలు పెరుగుతున్నాయి. పచ్చి కాయల ధరలు ఆకాశాన్నంటడంతో టెంకాయల ధర మండిపోతోంది. అందుకు కారణాలెన్నో ఉన్న ప్రధానమైనవి.. అందులో ఒకటి పంట దిగుబడి తగ్గడమైతే, మరో కారణం కొబ్బరి బొండాలకు డి మాండ్ పెరగడం. కొబ్బరి సాగు అధికంగా పండించే కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలో దిగుబడి గణనీయంగా తగ్గడంతో కాయలకు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పుకోవచ్చు. మళ్లీ శ్రావణ మాసంలో పం డుగలు, పూజలకు కొబ్బరికాయలు అధికంగా అవసరం ఉన్న నేపథ్యంలో వీటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో హోల్ సేల్‌గానే ధర పెరగడంతో సాధారణ, స న్న రకాల కాయల ధర రూ. 25 నుంచి 30 వరకు పలుకుతున్నా యి. నెల రోజుల్లోనే ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట దిగుబడి తగ్గడంతోనే కొబ్బరి కాయల ధర పెరిగినట్లు వ్యాపారులంటున్నారు. కొబ్బరి సాగు కర్ణాటక రాష్ట్రంలో ఎక్కువగా ఉండగా, కేరళ, అంధ్రప్రదేశ్, తమిళనాడు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. కర్ణాటకలో పంట సాగు గణనీయంగా తగ్గగా, కేరళలో వరదల కారణంగా పంట నష్టం జరిగిందంటున్నారు. కొబ్బరి కాయలు, కొబ్బరి బొండం, కుడుకలు, కొబ్బరి నూనె ధరలు పెరిగిపోయాయి. మొన్నటి వరకు కొబ్బరి కాయ రూ. 15 నుంచి 30 వరకు పెరుగగా, 500ల గ్రాముల కొబ్బరి నూనె రూ.170 ఉండగా ఇప్పుడు రూ. 235కు పెరిగింది. 200ల గ్రాముల కొబ్బరి నూనె డబ్బా రూ. 68 ఉండగా ఇప్పు రూ.98కి చేరింది. ఎండు కుడుకలు మొన్నటి వరకు కిలో రూ. 160 నుంచి రూ. 200లు పలుకగా 20 రోజుల కాల వ్యవధిలో కిలో రూ. 300 నుంచి 360 పలుకుతుంది. అలాగే కొబ్బరి బొం డం రూ.40 నుంచి 60 చిన్న సైజ్ రూ. 50 పలుకుతుంది. ఏది ఏమైనా కొ బ్బరి కాయ నుంచి కొబ్బరి నూనె వరకు ధరలు అధికంగా పెరగడంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్

నిర్మల్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల అభివృద్ధికి నిరంతరం స్పష్టమైన ప్రణాళికతో కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ఫై జాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్యం, పన్నుల వసూలు, మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణ సుందరీకరణ, తదితర అంశాలతపై మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాణిజ్య, వ్యాపార, ప్రకటనల, పన్నులు అన్నింటినీ సకాలంలో వసూలు చేయాలన్నారు. వార్డుల్లో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలన్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పట్టణంలో కీలకమైన కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అధికారులంతా సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బుగ్గరాం (బి)లో భీంరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరామర్శించారు. కుంటాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అశోక్ తల్లి. చీటి ముత్తయ్య కుమారుడు బుగ్గరాం బి గ్రామానికి చెందిన జాదవ్ భీంరావు ఇటీవలే మృతి చెందగా విషయం తెలుసుకొని వారి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బోథ్ చీటి ముత్తయ్య కుటుంబ సభ్యులకు ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. అయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, సురేందర్. ఎ. అంబారావ్. మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

బావిలో మొలిచిన దానిమ్మ చెట్లు


బావిలో పెరిగిన దానిమ్మ చెట్టుకు పూత పూసిన దృశ్యం

ఉట్నూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వినాయకచౌక్ కూడలి వద్ద ఉన్న పాత బావిలో గోడకు దానిమ్మ చెట్టు మొలచింది. బావి లోపల ఉన్న గోడకు దానిమ్మ మొక్క నాటుకొని చెట్టుగా పెరగడంతో దానికి పువ్వులు, కాయలు కాస్తున్నాయి.ఇది చూసిన ప్రజలు ఆశ్చర్యానికి లోను అవుతున్నారు. భూమిలో నాటిన మొక్కలే ఎదగడకుండా చనిపోతుండగా బండరాళ్లతో ఉన్న బావి గోడకు పండ్ల చెట్టు పెరిగిందని అనుకుంటున్నారు. పక్షులు విసర్జన చేయడం ద్వారా అక్కడ దానిమ్మ విత్తనం పడి మొలక వచ్చిందేమోనని అంటున్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి)

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం: నం.24-బి, గాంధీనగర్, కుంబకోణం- 612001 మరియు శాఖ కార్యాలయం: ఇ.నం.5-186/2, ఇక్బాల్ అహ్మద్ నగర్, గ్రౌండ్‌ఫ్లోర్, మంచిర్యాల, ఆదిలాబాద్ - 504208, మంచిర్యాల శాఖ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) & (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, రుణగ్రహీతలైన నం.1) శ్రీ గడికొప్పుల లావణ్య భర్త జి. నందయ్య, ఇ.నం.11-179, బిబి ఏరియా, పురపాలక కార్యాలయం దగ్గర, మంచిర్యాల - 504208; నం.2) శ్రీ గడికొప్పుల నందయ్య తండ్రి జి. రాజయ్య, ఇ.నం.11-179, బిబి ఏరియా, పురపాలక కార్యాలయం దగ్గర, మంచిర్యాల - 504208 వారికి **06.05.2025** తేదీగల డిమాండ్ ప్రకటన జారీచేశారు మరియు ప్రకటనలో తెలిపిన మొత్తం **రూ.10,60,245/-** (రూపాయలు పది లక్షల అరవై వేల రెండు వందల నలభై ఐదు మాత్రమే) తో పాటు నెలవారీ వాయిదాలతో **29.04.2025** నుండి దానిపై తదనంతర వడ్డీని సదరు ప్రకటన తేదీ నుండి **60** రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరారు.

పైన తెలిపిన చట్టబద్ధమైన ప్రకటన స్వీకరణ తదుపరి కూడా సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో పైన తెలిపిన పేరుగల రుణగ్రహీతలు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 29 జూలై 2025న స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన తెలిపిన పేరుగల రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా పైన తెలిపిన పేరుగల రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **రూ.10,90,256/-** (రూపాయలు పది లక్షల తొంభై వేల రెండు వందల యాభై ఆరు మాత్రమే) మరియు పూర్తి బకాయిలు చెల్లించే వరకు **15.07.2025** నుండి దానిపై వడ్డీ సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకు లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత/లు కోరబడుచున్నారు.

మా బ్యాంక్‌కు తనఖాపెట్టబడిన సిరాస్తి
షెడ్యూలు - ఎ: (శ్రీ గడికొప్పుల లావణ్య భర్త జి. నందయ్యకు చెందిన ఆస్తి)
మంచిర్యాల జిల్లా, మంచిర్యాల పురపాలక సంఘం పరిధిలోని గార్మిళ్ల శివారు వద్దగల 925.31 చ.అ. విస్తీర్ణ నిర్మిత ఏరియాతో 173.04 చ. గజాల విస్తీర్ణం గల ఇ.నం.11-179 కలిగిన ఇల్లు మరియు సరిహద్దులు: ఉత్తరం: 40 అడుగుల రోడ్డు, తూర్పు: ఎన్. కుమారస్వామి యొక్క ఇల్లు మరియు ప్రహరీ గోడ, పశ్చిమం: విక్రయదారు ఇల్లు, దక్షిణం: నడిమెల మొండయ్య మరియు చంద్రపద్మ ఇల్లు.

ప్రదేశం: మంచిర్యాల, తేది: 29.07.2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం:149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.: 0435-2402322, ఫ్యాక్స్: 0435-2431746, వెబ్‌సైట్: www.cityunionbank.com

పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత

• జిల్లా అటవీ అధికారి నాగిని భాను

సారంగాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిదని జిల్లా అటవీ అధికారి నాగిని భాను అన్నారు. శుక్రవారం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ నందనవనంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలునాటారు. నాటిన మొక్కలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ అర్జుమాన్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, అడెల్లి మహాపోచమ్మ ఆలయ చైర్మన్ బోజాగౌడ్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

రైతులకు అవసరమైన
ఎరువులను అందుబాటులో ఉంచాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎరువుల దుకాణాల యజమానులను కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలి(బి) గ్రామంలోగల డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఎరువుల దుకాణాల్లో నిల్వ ఉన్న యూరియాతో పాటు ఎరువుల వివరాలను స్టాక్ బోర్డులపై రాయాలని సూచించారు. ఎరువుల అమ్మకానికి సంబంధించిన రశీదులను తనిఖీ చేశారు. రైతులకు నష్టం కలిగించేలా ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ, గడువు తీరిన ఎరువులను విక్రయించవద్దని హెచ్చరించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు, పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందనవసరం లేదని పంటలకు అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వాడకం చేయాలన్నారు. అధికంగా ఎరువుల వాడకంతో భూసారం తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని వివరించారు. గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసిన పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని యాజమానులతో పేర్కొన్నారు. గడువుతీరిన, నకిలీ మందులను విక్రయించవద్దని హెచ్చరించారు. అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, అధికారులున్నారు.


అడెల్లి నందనవనంలో మొక్కలు నాటుతున్న దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

జనహితను విజయవంతం చేద్దాం

• డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌టౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర 3న ఖానాపూర్ నియోజకవర్గంలో చేపట్టనున్నారని, ఈ పాదయాత్రను విజయవంతం చేద్దామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాయంత్రం 5గంటలకు బాధనకుర్తికి చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. 4న శ్రమదానం, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోనున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పరిశీలకులు రామ్మోహన్, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి ఉన్నారు.

కళాశాలలో డీఐఈవో ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఖానాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డీఐఈవో) పరశురాం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో మాట్లాడిన డీఐఈవో సబ్జెక్టుల బోధన జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని సూచించారు. ఐఐటీ, జేఈఈ, ఎప్‌సెట్, నీట్ తదితర పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై అడ్మిషన్లను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠేకు భారతరత్న ఇవ్వాలి

• జయంతి వేడుకల్లో పలువురి డిమాండ్



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

భైంసా, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శక ఆదర్శ సామాజిక సంఘ సంస్కర్త, సాహిత్య సమ్రాట్ అన్నాబావు సాఠేకు భారత రత్న ఇవ్వాలని అన్నాభావు సాఠే కమిటీ ముథోల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉత్తమ్ బాలేరావ్, ప్రధాన కార్యదర్శి గాయక్వాడ్ గంగాధర్ డిమాండ్‌చేశారు. శుక్రవారం భైంసాలో జరిగిన అన్నాభావుసాఠే జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ వ్యవస్థ, బడుగు, బలహీనవర్గాల మెరుగులకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నాభావు సాఠే ముథోల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దిగంబర్, రాష్ట్ర ప్రతినిధి చంద్రబాన్ గణపతి, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నర్సాపూర్(జి), ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో గల ఎరువుల దుకాణాన్ని శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) చంద్యాల గణేష్ తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువుల నిల్వలు, ధరల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని సూచించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, సరైన రికార్డులను నిర్వహించాలని తహసీల్దార్ ఆదేశించారు. తనిఖీతో ఎరువుల దుకాణాదారులలో కొంత ఆందోళన నెలకొంది.

బాధిత కుటుంబానికి జస్టిస్ చంద్రకుమార్ పరామర్శ


చెక్కు అందజేస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయపూర్ గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు భీమన్న కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. భీమన్న భార్య, పిల్లలకు రూ.10వేల ఆర్థిక సహాయంచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించే పంటలకు ముందే మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకో వాలని కోరారు. మృతి చెందిన రైతులకు 10 లక్షల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. రైతుసంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, కోశాధికారి సూర్యకిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

» స్థానికంగా న్యాయ పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గం
» అవసరమైతేనే ఇక కోర్టులకు..
» మధ్యవర్తిత్వం ద్వారా లోక్‌అదాలత్‌లలో కేసుల పరిష్కారం
» ఎస్పీ నేతృత్వంలో అమలుకు సన్నాహాలు

సామాజిక మధ్యవర్తిత్వం



గ్రామ స్థాయిలో వివాదాలు, న్యాయపరమైన స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఇక నుండి సామాజిక మధ్యవర్తిత్వ విధానాన్ని అమలు చేయనున్నారు. అన్ని న్యాయ స్థానాల పరిధిలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లను లక్ష్యంగా చేసుకొని ఈ సామాజిక మధ్యవర్తిత్వ ప్రక్రియను తెరపైకి తెస్తున్నారు. దీని కోసం గాను గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక మధ్యవర్తులను నియమించాలని నిర్ణయించారు.

నిర్మల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ జానకీ షర్మిల మధ్యవర్తుల నియామకానికి సం బంధించి మార్గదర్శకాలను సైతం రూపొందించారు. గ్రామంలో నిజాయితీగా ఉంటూ అందరి చేత మంచివారుగా గుర్తింపు పొందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలను కమ్యూనిటీ మీడియేటర్లుగా నియమించనున్నారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల వారీగా ఈ సామాజిక మధ్యవర్తుల గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై గ్రామస్థాయిలో న్యాయసాధన సులభంగా సాధించవచ్చని ఎస్పీ సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. దీనిపై పోలీసు అధికారులు అందరూ దృష్టి సారించాలని ఆమె కోరారు. స్థానిక ప్రజలందరినీ న్యాయ పరిష్కార ప్రక్రియలో భాగస్వామ్యం చేసేందుకే కాకుండా గ్రామాల్లో శాంతియుత, సమగ్ర వాతావరణం ఏర్పడేందుకు కమ్యూనిటీ మీడియేషన్ ఉపయోగపడుతుందని పోలీసు శాఖ భావిస్తోంది. ఎస్పీ ఆదేశాలతో సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు గ్రామాల వారీగా మధ్యవర్తుల గుర్తింపు ప్రక్రియను చేపట్టి జాబితా రూపొందించబోతున్నారు.

నిబద్ధత ఉన్న వారికే ప్రాధాన్యం

గ్రామాల్లో నీతి నిజాయితీతో ఉంటూ ఇప్పటికే మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందిన వారినే కమ్యూనిటీ మీడియేటర్లుగా ఎంపిక చేయనున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు, సోషల్ వర్కర్లు, గ్రామ పెద్దలకు అవకాశం కల్పించనున్నారు. అయితే వీడీసీ వ్యవహారాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వివాదాస్పదులుగా ముద్ర పడిన వారిని కమ్యూనిటీ మీడియేషన్‌కు దూరంగా ఉంచనున్నారు. చిన్న చిన్న కుటుంబ తగాదాలు, స్థానికంగా ఏర్పడే సమస్యల పరిష్కారాలకు ఇక కమ్యూనిటీ మీడియేటర్లు ఉపయోగపడనున్నారు. కమ్యూనిటీ మీడియేషన్ ద్వారా కేసుల తీవ్రత ఆధారంగానే పోలీస్ స్టేషన్‌లు, కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉంటుందే తప్ప స్థానికంగా ఏర్పడే మామూలు వివాదాలన్నీ కమ్యూనిటీ మీడియేషన్ ద్వారానే పరిష్కారానికి నోచుకునే అవకాశం అవకాశం ఉంటుంది.



విస్తృత అవగాహన కార్యక్రమాలు

ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్ ప్రక్రియపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఎస్పీ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో ఈ ప్రక్రియపై చర్చించారు. కమిటీ మీడియేటర్ల నియామక ప్రక్రియలో స్థానిక ప్రజల అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. దీనికోసం గాను పోలీస్ స్టేషన్‌ల వారీగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ పెద్దలతో ఈ సమావేశాలు ఏర్పాటు చేసి సామాజిక మధ్యవర్తుల నియామకం, వారి బాధ్యతలపై వివరించనున్నారు. సామాజిక మధ్యవర్తులందరికీ అవసరమైతే గుర్తింపు కార్డులు కూడా జారీ చేయాలని భావిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేని వ్యక్తులకే ఈ ప్రక్రియలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే వివాద రహితంగా వ్యవహరిస్తూ గ్రామంలో పెద్ద మనిషి తరహా ముందుండే వ్యక్తులను నియమించాలని నిర్ణయించారు.

రాజీమార్గమే రాజమార్గం : ఎస్పీ



క్షణికావేశంలో ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసుల విషయంలో పట్టింపులకు పోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి. అనవసర వివాదాలకు పోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలి. ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసులతో ఏళ్ల తరబడిగా ఇరుపక్షాలు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇటువంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి.


పదవీ విరమణ పొందిన ఎస్సైని సన్మానిస్తున్న దృశ్యం

పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి సన్మానం

నిర్మల్‌రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ జానకీ షర్మిల సన్మానం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎస్పీ పదవీ విరమణ పొందుతున్న సిబ్బందిని సత్కరించి, వీడ్కోలు పలికారు. పదవీ విమరణ పొందిన భాస్కరరావు బి. గోపాలకృష్ణలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏవో యూనస్ అలీ, ఆర్‌ఐ రాంనిరంజన్‌రావు, ఇతర పోలీస్ సిబ్బంది, రిటైర్డ్ అవుతున్న కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ..

జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ పొందిన బూర ఉమాశంకర్‌ను ఘనంగా సన్మానించినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఈఈ జాదవ్ చందు, డిప్యూటీ ఈఈ రాథోడ్ తుకారాం, డీఏవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

3న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక

ముథోల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను విజయవంతం చేయాలని నిర్మల్ జిల్ల తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బూర శంకర్ ఒక ప్రకటనలో కోరారు. 3న మధ్యాహ్నం 1:30 గంటలకు వరంగల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ యందు నిర్వహించడనున్నట్లు తెలిపారు.

తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

• అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్

భైంసా, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల ద్వారా శిశువులకు రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ పేర్కొన్నా రు. శుక్రవారం భైంసా ఏరియా ఆసుపత్రిలో డీఎంఅండ్‌హెచ్‌వో డా.రాజేందర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఆకాష్‌లతో కలిసి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.తల్లిపాలతో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు అందుతాయన్నారు. అంతేకాకుండా జీర్ణ సమస్యల ప్రమాదాల నివారణ, ఇన్ఫెక్షన్ల సమస్యలు దూరమవుతాయన్నారు. పిల్లల మెదో వికాసానికి తల్లిపాలు దోహదపడుతాయన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డా.రాజేంధర్ మాట్లాడుతూ పిల్లలకు పాలివ్వడం మూలంగా తల్లులకు సైతం పలు వ్యాధులు దూరమవుతాయన్నారు. ప్రధానంగా రోమ్ము, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందన్నారు.

ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు

అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఏరియా ఆసుపత్రిలోని పలు వార్డులో కలియ తిరిగి తనిఖీలు చేపట్టారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. పలు వార్డులలో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌ను పరిశీలించి రక్త, మూత్రపరీక్షల ఫలితాలను రోగులకు కాలయాపనకు తావు లేకుండా సకాలంలో అందజేయాలని సూచించారు. సరఫరా అయిన మందుల వివరాలను సక్రమంగా నమోదుచేసి వాటి పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని పార్మసిస్ట్ సిబ్బందికి సూచించారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్, ముథోల్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. అనిల్‌తో పాటు ఐసీడీఎస్ అధికారులు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శుక్రవారం ముథోల్‌లో 5, 9, 12 అంగన్‌వాడీ సెంటర్‌లలో అలాగే మండలంలోని సరస్వతీ నగర్, ఆష్టా, బోరిగాం, తరోడ తండా, ఎడ్‌బిడ్ తదితర గ్రామాల్లోగల అంగన్‌వాడీ సెంటర్‌లలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ తల్లిపాల వలన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శిశువుకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు తప్పక పట్టించాలని వివరించారు. డబ్బా పాలు, పోత పాలు పట్టించడం వలన శిశువు ఎదుగుదల లోపంతో పాటు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమన్నారు. తల్లిబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, తల్లులు, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎంఅండ్‌హెచ్‌వో డా. రాజేందర్


తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం


ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవోలు

గ్రోమోర్ కేంద్రం తనిఖీ

ముథోల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లో గల మన గ్రోమోర్ ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తహసీల్దార్ శ్రీలత, మండల వ్యవసాయ అధికారి రచనలు శుక్రవారం తనిఖీచేశారు. మేనేజర్ యోగేష్‌ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులు రశీదును అందించాలని సూచించారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ ఫీల్డ్‌అసిస్టెంట్ బి. రాకేష్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ అంశంలో ఎమ్మెల్యే వైఖరి సరికాదు

• ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకుల నిరసన
• నేడు ఖానాపూర్ బంద్‌కు జేఏసీ పిలుపు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

ఖానాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలనే నాలుగు మండలాల ప్రజల డిమాండ్ పట్ల ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నిర్లక్ష్య పూరితమైన వైఖరి సరికాదని జేఏసీ కన్వీనర్ నంది రామయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వైఖరికి వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ నంది రామయ్య మాట్లాడుతూ గత కొంతకాలంగా ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ నాలుగు మండలాల విద్యార్థుల సౌకర్యార్థం ఖానాపూర్‌లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారన్నారు. పట్టణ శివారులోని 110 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సరిపడా స్థలం ఉందని జేఏసీ గత కొంతకాలంగా చెప్తున్నా అధికారులు మాత్రం స్థలం లేదని కాలయాపన చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉట్నూర్ తరలిపోయేలా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే జేఏసీని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం దుందుడుకు విధానాలను అనుసరించడం సరికాదని మండిపడ్డారు.

నేడు ఖానాపూర్ బంద్‌కు పిలుపు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో ఎమ్మెల్యే అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా శనివారం ఖానాపూర్ బంద్‌కు జేఏసీ పిలుపునిచ్చిందని జేఏసీ కన్వీనర్ నంది రామయ్య తెలిపారు. నాలుగు మండలాల విద్యార్థుల భవితవ్యం కోసం నిర్వహిస్తున్న ఈ బంద్‌కు అన్ని వ్యాపార వర్గాలు సహకరించాలని ఆయన కోరారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఖానాపూర్‌లో నిర్మించే వరకు దశలవారీగా జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మణరావు, కో కన్వీనర్లు ఆకుల శ్రీనివాస్, బీసీ రాజన్న, కే. గంగారావు, ప్రధాన కార్యదర్శి కాశవేణి ప్రణయ్, ముఖ్య సలహాదారులు అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, శ్రావణ్ ఉన్నారు.